కవితకు బెయిల్ మంజూరుపై హర్షం

హుస్నాబాద్‌లో పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు

హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో పటాకులు కాలుస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, ఆగస్టు 27: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై బీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, బొజ్జ హరీశ్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, నాయకులు సూరంపల్లి పరశురామ్, నమిలికొండ రాజయ్య, యాటకార్ల స్వరూప, గోనెల మధుకర్, కాయిత నవీన్‌రెడ్డి, కందుకూరి సతీశ్, రాజేందర్‌రెడ్డి, జగ్జీవన్, తిరుపతి, చిట్యాల సంపత్, ప్రేమ్ కుమార్, వెర్సినాయక్, రాజునాయక్, పెసరు శ్రీనివాస్, సునీత పాల్గొన్నారు.

గజ్వేల్‌లో మాట్లాడుతున్న మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరిగింది..

గజ్వేల్, ఆగస్టు 27: రాజకీయ ప్రేరేపిత ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేయడం పట్ల గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడారు. రాజకీయ ప్రేరేపిత ఆక్రమ కేసులు పెట్టిన చివరికి న్యాయం గెలిచిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు హర్షించతగిన విషయమన్నారు.

మర్కూక్‌లో..

మర్కూక్, ఆగస్టు 27: కవితకు బెయిల్ మంజూరుపై మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ బాల్‌రాజ్ అధ్వర్యంలో మంగళవారం ఎర్రవల్లి వరదరాజ్‌పూర్‌లోని హనుమాన్ దేవాలయంలో పూజలు చేశారు. నాయకులు శరత్‌రావు మాజీ ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, మల్లేశం, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్‌కు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

చేర్యాల, ఆగస్టు 27 : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్లాట్లు, వెంచర్ల రెగ్యులరైజేషన్ కోసం హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసినట్లు చేర్యాల మున్సిపల్ కమిషనర్ నాగేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020లో లేఅవుట్, ఓపెన్ ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుకు టోకెన్ అమౌంట్ చెల్లించిన అర్జీదారులు అమౌంట్ చెల్లించిన రసీదు, భూమి డాక్యుమెంట్, ఈసీ, వెంచర్ మ్యాప్‌లను మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లనందు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు శ్రావణ్‌కుమార్-77318 32327(హెల్ప్‌డెస్క్-1), పావనిరావు-99 5953 6699(హెల్ప్‌డెస్క్-2),నాగేందర్-9491018886(హెల్ప్‌డెస్క్-3)లను సంప్రదించాలని సూ చించారు.

ఇండియన్ ఆర్మీ సైనికుడు మృతి

రిమ్మనగూడలో విషాదఛాయలు

గుండారం శ్రీనివాస్

గజ్వేల్, ఆగస్టు 27: దేశ రక్షణ కోసం ఇండియన్ ఆర్మీలో చేరి 23 ఏండ్లు దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన గుండారం శ్రీనివాస్ (40) అనారోగ్యంతో మహారాష్ట్రలోని పుణే దవాఖానలో మంగళవారం చికిత్సపొందుతూ విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామానికి చెందిన గుండారం శ్రీనివాస్ (40) ఇండియన్ ఆర్మీలో 2002లో చేరాడు. మొదట జమ్ముకాశ్మీర్‌లో సిపాయిగా చేరిన తర్వాత ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, చైనా బార్డర్‌లో విధులు నిర్వహించారు. హవల్దార్‌గా విధు లు నిర్వహిస్తున్న శ్రీనివాస్ గత నెలలో జమ్ముకాశ్మీర్‌కు బదిలీ అయ్యాడు. బదిలీ అయిన తర్వాత స్వగ్రామానికి వచ్చిన సందర్భంలోనే అనారోగ్యానికి గురి కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు అతడిని సికింద్రాబాద్‌లోని ఆర్మీ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ప్రత్యేక హెలికాప్టర్‌లో మహారాష్ట్రలోని పుణేలోని ఆర్మీ దవాఖానకు తరలించి కొన్ని రోజుల నుంచి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గ్రామానికి చెందిన సైనికుడు శ్రీనివాస్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

క్రమశిక్షణతో చదివితే విజయం ఖాయం

హుస్నాబాద్, ఆగస్టు 27: యువత నేటి సోషల్ మీడియా లాంటి ఫోన్, టీవీలాంటి మాధ్యమాలకు పరిమితం కాకుండా పుస్తక పఠనం ద్వారానే ఎక్కువ విజ్ఞానాన్ని పొంద వచ్చని హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, బీఎన్‌రావు ఫౌండేషన్ వైర్మన్ డాక్టర్ బీఎన్ రావు అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని శాఖా గ్రంథాలయానికి నిరుద్యోగ యువతీ,యువకుల కోసం బీఎన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు క్రమశిక్షణతో చదివితేనే పోటీ పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగం పొందుతారని, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

గంజాయి సేవిస్తున్న ఐదుగురు అరెస్టు

కొమురవెల్లి, ఆగస్టు 27 : కొమురవెల్లి గ్రామ శివారులో దసారం గుట్టకు గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లి సిద్దిపేటకు చెందిన జంగం ఓంకార్, ఎండీ. సమీర్, నంగనూరు నాగేశ్ అనే యువకులు కొమురవెల్లికి చెందిన ఇద్దరు మైనర్లు నుంచి గంజాయి కొనుగోలు చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గంజాయికి అలవాటు పడి కొమురవెల్లికి చెందిన ఇద్దరు మైనర్లు చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లికి గ్రామానికి చెందిన ప్రేమ్‌రాజ్ వద్ద గంజాయి కొనుగోలు చేసి ఆగంజాయి ఇతరులకు అమ్ముతూ వచ్చిన ఆదాయంతో జల్సాలకు చేస్తుంటారు. కొమురవెల్లి శివారులో దాసరం గుట్టకు గంజాయి సేవిస్తున్నారనే సమాచారంతో ఘటన స్థలానికి వెళ్లి సిద్దిపేటకు చెందిన జంగం ఓంకార్, ఎండీ. సమీర్, నంగనూరు నాగేశ్ అనే యువకులు కొమురవెల్లికి చెందిన ఇద్దరు మైనర్లు నుంచి గంజాయి కొనుగోలు చేస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి 60 గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్లు, రెండు బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

గజ్వేల్, ఆగస్టు 27: పట్టణంలోని 15 వార్డు అయ్యప్ప కాలనీలోని రోడ్లను వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ మంగళవారం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్ గోల్కొండ నర్సయ్యకు వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ సభ్యులు బండ్లస్వామి, వీరారెడ్డి, రమేశ్ గౌడ్, రాజేశం, మల్లేశం, నారాయణరెడ్డి, జీవన్‌రెడ్డి, చంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు

పూజలు చేస్తున్న మహిళలు

సిద్దిపేట కమాన్, ఆగస్టు 27 : సిద్దిపేట పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో అమ్మవారిని పూలతో అందంగా అలంకరించారు. భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. పూజలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలి

దుబ్బాకలో వార్డెన్‌లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకలో వసతిగృహాల వార్డెన్‌లతో ఎమ్మెల్యే సమీక్ష

దుబ్బాక, ఆగస్టు 27 : వసతిగృహాల్లో చదువుకునేది నిరుపేద విద్యార్థులేనని,వారికి మెరుగైన వసతులు కల్పించి, గుణాత్మక విద్యనందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వసతిగృహా వార్డెన్లకు సూచించారు. మంగళవారం దుబ్బాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలికల, బాలుర వసతిగృహాల వార్డెన్‌లతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో మొత్తం 9 వసతి గృహాలకు గానూ ఒకటి ఇంటిగ్రేటెడ్ హాస్టల్, మరొకటి బీసీ కళాశాల విద్యార్థుల వసతిగృహాలున్నాయి. ఆయా వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను, విద్యార్థులకు అందిస్తున్న భోజన వసతుల గురించి వార్డెన్‌లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య తలెత్తకుండా వార్డెన్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నాయని విద్యార్థులకు మంచి భోజనంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మెదక్ డీబీసీడీవో నాగరాజుగౌ డ్, సిద్దిపేట, మెదక్ ఏఎస్‌డబ్ల్యూవోలు ఎండీ. హమీద్, లింగేశ్వర్,అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి భద్రయ్య, హెచ్‌డబ్ల్యూవో చంద్రయ్య, వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

దుబ్బాక నియోజకవర్గంలో ..

దుబ్బాక నియోజకవర్గంలో కేవలం 60 శాతం మాత్రమే రుతు రుణమాఫీ జరిగిందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ పేరిట గొప్పగా ప్రకటనలు చేస్తున్నదని ఆచరణలో మాత్రం చాలా అధ్వానంగా ఉందని మండిపడ్డారు. త్వరలోనే రైతులతో మరో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. దుబ్బాక ఏడీఏ మల్లయ్య, ఏవోలు ప్రవీణ్, మల్లేశం, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట-భూంపల్లి మండలం నగరం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ప్రవీణ్ ఇటీవల మృతి చెందగా, అతడి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ తరుపున రూ. 2 లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి అందజేశారు. నియోజకవర్గంలో 14 మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. దుబ్బాక మాజీ జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రోట్టే రాజమౌళి, భూంరెడ్డి, కిషన్‌రెడ్డి, జీడిపల్లి రవి, కౌన్సిలర్‌లు దేవుని లలిత, ఆస స్వామి, యాదగిరి, శ్రీనివాస్, తదితరులు పా ల్గొన్నారు.

పలువురికి పరామర్శ..

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్ మాజీ సర్పంచ్ , బీఆర్ఎస్ నాయకుడు పిట్ట స్వామి తల్లి ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజక్కపేట మాజీ సర్పంచ్ శంకరయ్య మృతిచెందగా, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన స్థానిక విలేకరి అస్క రాజు ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- టౌన్ ప్లానింగ్ అధికారి తీరుపై కౌన్సిల్ సభ్యుల మండిపాటు
- అధికారులు సమయపాలన పాటించడం లేదని సభ్యుల ఆరోపణ

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు, హాజరైన అధికారులు, కౌన్సిలర్లు

సిద్దిపేట, ఆగస్టు 27 : పట్టణంలో సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన ఇండ్లను నిర్మిస్తుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు ఎంచేస్తున్నారని పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు ప్రశ్నించారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులారాజనర్సు అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. మున్సిపల్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. ముఖ్యంగా టౌన్ ప్లానిం గ్ అధికారి వ్యవహార తీరుపై సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ప్రారం భం కాగానే సమావేశంలో 31 అంశాలతో ఎజెండాను చదువుతున్న సమయంలో విపక్ష సభ్యులు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఎజెండాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులు మాట్లాడుతూ ఎన్ని అపార్ట్‌మెంట్లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఎలా ఇచ్చారో సమాధానం చెప్పాలని ఆడుగగా టౌన్‌ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన సభ్యులు టౌన్ ప్లానింగ్ అధికారిని సీడీఎంఏకు సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు సమయ పాలన పాటించడం లేదని కౌన్సిల్ సభ్యులు ఆరోపించారు. సమయ పాలన పాటించని అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను చైర్‌పర్సన్ మంజుల ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతుండగా విపక్ష సభ్యులు వాకౌట్ చేయడం సభ్యులను అవమానపరచడమేనని చైర్‌పర్సన్ అన్నారు. చెట్లను నరకొద్దని, కొమ్మలను మాత్రమే ట్రిమ్మింగ్ చేయాలన్నారు. సిద్దిపేట పట్టణంలో పారిశుద్య నిర్వహణపై 'నమస్తే తెలంగాణ' పత్రికలో కొరవడిన చెత్త శుద్ధి కథనంపై మున్సిపల్ శానిటరీ విభాగం అధికారుల తీరుపై చైర్ పర్సన్ మంజులా రాజనర్సు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనుకరాజు, కమిషనర్ ప్రేరణ, కౌన్సిలర్లు లక్ష్మణ్, వినోద్, మల్లికార్జున్, ధర్మవరం బ్రహ్మం, అరవింద్ రెడ్డి,యోగేశ్వర్, సతీశ్, చంద్రం, బర్ల మల్లికార్జున్, సాయికుమార్, రేణుకాతిరుమల్‌రెడ్డి, దీప్తి నాగరాజు, సంధ్య శ్రీకాంత్, కాటం శోభారఘురాం, అడ్డగట్ల కావేరి అంజి, శ్రీల తరాజు, పాతురి సులోచన శ్రీనివాస్‌రెడ్డి, దాసరి భాగ్యలక్ష్మి శ్రీనివాస్, భూంపల్లి శ్రీలత శ్రీహరి, బింగి బాల్‌లక్ష్మి రాజేశం, ఉదర జయ వెంకటరెడ్డి, వరాల కవిత సురేశ్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

జగదేవ్‌పూర్, ఆగస్టు 28 : మండలంలోని తీగుల్ రైతు వేదికలో మంగళవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ అధిక వర్షాలకు పంటల్లో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పత్తి,వరి, మొక్కజొన్న, కంది కూరగాయలు, పంటల సాగులో పాడుల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానలు సమాచారం అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు శరణ్య, సమత, ఖలీల్, భానుప్రకాశ్, కిరణ్, కృష్ణమూర్తి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



తుంగ పవన్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 27 : చేర్యాల సీనియర్ జర్నలిస్టు తుంగ పవన్ కుమార్, ప్రముఖ వైద్యుడు తుంగ రఘునందన్ రాణాల తండ్రి రిటైర్డ్ ఎంఈవో తుంగ రామస్వామి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మంగళవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట చేర్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, నాయకులు పుర్మ ఆగంరెడ్డి, మెరుగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్ సందర్శన

కొమురవెల్లి, ఆగస్టు 27 : మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను మంగళవారం జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా గోదావరి జలాలకు పూజాలు చేశారు. అనతరం గురువన్నపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అందె వీరేశం కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు చెరుకు రమణారెడ్డి, సనాది భాస్కర్, బ్రహ్మండ్లపల్లి చంద్రం, బుడిగె భిక్షపతి, ఐలేనిగౌడ్ ఉన్నారు.

ఎఫ్‌సీఆర్ఐలో జీవన సాంకేతిక విజ్ఞాన సదస్సు

బయోటెక్నాలజీ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేస్తున్న ప్రొఫెసర్లు

ములుగు, ఆగస్టు 27 : అటవీ పరిరక్షణకు జీవనసాంకేతిక విజ్ఞానం (బయోటెక్నాలజీ) కీలక భూమిక పోషిస్తున్నదని అటవీ కళాశాల డీన్ డాక్టర్ ఆశ అన్నారు. మండల కేంద్రం ములుగులోని అటవీ కళాశాల పరిశోదన కేం ద్రంలో మంగళవారం నిర్వహించిన జీవనసాంకేతిక విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. భూమిపై జీవ మనుగడకు అడవులు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ అట్టిపల్లి ఆర్‌రెడ్డి, ఎన్ఆర్ఎస్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, సీఎస్ఐఆర్-సీఐఎంఏపీ ప్రతినిధి డాక్టర్ సత్యశ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సత్యహర్ష, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చేర్యాలలో నిరసన తెల్పుతున్న సీఐటీయూ నాయకులు

చేర్యాల, ఆగస్టు 27: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరూతూ సీఐటీయూ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షురాలు ఇప్పకాయల శోభ మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌ను దారుణంగా హింసించి లైంగికదాడి జరిపి హత్య చేశారని, మహిళలకు రక్షణ కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందారని విమర్శించారు. మెడికల్ కాలేజీలు, దవాఖానల్లో మహిళా వైద్యుల, నర్సుల ఉద్యోగ రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకరావాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ పట్టణ కమిటీ కార్యదర్శి రాళ్లబండి భాస్కర్, నాయకులు హరికృష్ణ, సంతోశ్, అనిల్ కుమార్, లక్ష్మి, పద్మ, కన కవ్వ, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలపై విచారణ జరపాలి

సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌గౌడ్

హుస్నాబాద్, ఆగస్టు 27: గ్రామాలు, పట్టణాల్లో కబ్జాలకు గురైన చెరువులు, కుంటల శిఖం భూములపై అధికారులు వెంటనే విచారణ జరపాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హుస్నాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని గ్రామాల్లో చెరువు, కుంటలు, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని అక్రమంగా నిర్మాణాలు చేశారని, వాటిని తొలిగించాలన్నారు. హుస్నాబాద్‌లోనూ హైడ్రాలాంటి కమిటీని వేసి కబ్జాకు గురైన స్థలాలను స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు, నాయకులు ఎలగందుల శంకర్, మారెపల్లి సుధాకర్, జేరిపోతుల రవీందర్, వేల్పుల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

హుస్నాబాద్, ఆగస్టు 27: విద్యార్థులు తమ ఇంటి పరిసరాలతో పాటు కళాశాల ఆవరణను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందుల శోభాదేవి అన్నారు. మంగళవారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలికల కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణను వలంటీర్లు, విద్యార్థినులు శుభ్రం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలుతున్నందున అందు కు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ దామెర కరుణాకర్, అధ్యాపకులు రవీందర్, సదానం దం, నిర్మలాదేవి, లక్ష్మయ్య, సంపత్, విద్యార్థినులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

సిద్దిపేట టౌన్,ఆగస్టు 27 : సిద్దిపే ప్రభుత్వ డిగ్రీ రసాయన శాస్త్రం విభాగ అధ్యాపకుడు గాలి శ్రీనివాస్ శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు .పరిశోధన గ్రంథానికి గానూ డాక్టరేట్ పట్టాను పొందిన శ్రీనివాస్‌ను కళాశాల అధ్యాపకుల అభినందనలు తెలిపారు. అధ్యాపకులు శ్రీధర్, రవికుమార్, సుమలత, బాలకిషన్,మనోహర్,రవికుమార్, వసుధ, సుదర్శనం,శ్రద్ధానందం,మధుసూదన్ పాల్గొన్నారు.

మార్కండేయ మార్గంలో ముందుకు సాగాలి

తొగుట, ఆగస్టు 27: భక్తి ముక్తికి వరుసలో నిలిచే భక్త మార్కండేయ మార్గంలో అందరూ ముందుకు సాగాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తొగుటలో జరుగుతున్న మార్కండేయ దేవాలయంలో జరుగుతున్న ప్రతిష్ఠామహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మండలాధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 27 : కొండపాక మండలంలోని దుద్దెకు చెందిన పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ మిద్దె శంబయ్య, మాజీ ఉపసర్పంచ్ మిద్దె శివకుమార్, నాయకులు ఎండీ హాపిజ్, చిలుముల పరుశరాములు, చిక్కుడు భాను, శ్యామ్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతి, కరణ్, రాజు, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న నూనె కుమార్‌యాదవ్

మెరిట్ అవార్డ్స్ అందజేత

జగదేవ్‌పూర్, ఆగస్టు 27 : ఉత్తమ ప్రతిభ కనబరిచిన మున్నూరు కాపు విద్యార్థులకు మున్నూరు కాపు కాచిగూడ రాష్ట్ర మహాసభ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో నగదు బహుమతితో పాటు మెమోంటోలు అందజేశారు. మండలంలోని మునిగడప గ్రామానికి చెందిన ముశ్చపతి నందిని ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రూ. 2వేల నగదుతో పాటు మెమోంటో అందుకున్నది.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 27: ప్రభుత్వం రుణమాఫీ చేసినప్పటికీ చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రుణమాఫీ అర్హత కలిగిన రైతులందరికీ తక్షణమే మాఫీ వర్తింపచేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి వనేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐకేఎస్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. రుణమాఫీ కాని రైతులను ప్రభుత్వం గుర్తించి వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు సత్యనారాయణ, లక్ష్మణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 27: పురుగుల మందు తాగి ఓవ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మద్దూరు మండలంలోని ధర్మారం గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్సై జగదీశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కుల శేఖర్(32) మద్యానికి బానిసై ఈ నెల 20న పురుగు